

జగనన్న తోడు' కింద జిల్లాలో 11,634 మందికి లబ్ధి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జగనన్న తోడు పథకం కింద సత్యసాయి జిల్లాలో 11,634 మందికి రూ.11.63 కోట్లు లబ్ధి చేకూరిందని సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు. బుధవారం తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి చిరు వ్యాపారులకు, వృత్తిదారులకు ఆరవ విడత లో ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సాయంతో పాటు గతంలో రుణాలు పొందిన వారికి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తో పాటు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, కూడా ఛైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని 32 మండలాల్లో 10,240 మందికి రూ. 10.24 కోట్లు, మున్సిపాలిటీ పరిధిలో 1,394 మందికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో లబ్ధిదారులకు పంపిణీ జరిగిందన్నారు. ఈ సందర్భంగా వడ్డీ రాయితీ క్రింద మంజూరైన మెగా చెక్కును కలెక్టరు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా అధ్యక్షురాలు సాయి లీల, పట్టణ ఇన్‌ఛార్జి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం బస్టాండ్‌లో ప్రయాణికులు

పండుగ రద్దీ..

స్పెషల్ బస్సులు నడుపుతున్న ఆర్టీసీ ప్రయివేటు ఛార్జీలకు రెక్కలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సంక్రాంతి పండుగ రద్దీ పెరిగింది. విద్యా సంస్థలూ పండుగ సెలవులను ప్రకటించియున్నారు. దీంతో చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సొంత ఊళ్లకు వచ్చేస్తున్నారు. దీంతో బస్సులకు, రైళ్లకు రద్దీ పెరిగింది. ఉద్యోగ నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు కూడా సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి సొంత ఊళ్లకు వస్తున్నారు. ఆర్టీసీ, ప్రయివేటు బస్సులకు డిమాండ్ పెరిగింది. ముందుగా రిజర్వేషన్ చేసుకున్న వారికి సమస్య లేనప్పటికీ, అది లేని వారు బస్సుల కోసం, రైళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

అనంత రిజియన్‌లో 182 స్పెషల్ బస్సులు

పండుగ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అనంతపురం రీజియన్ నుంచి 182 స్పెషల్ బస్సులను జనవరి 6వ తేది నుంచే నడుపుతోంది. ఈనెల 18వ తేదీ వరకు ఈ స్పెషల్ బస్సులు నడపాలని నిర్ణయించింది. హైదాబారద్‌కు 41 బస్సులు, బెంగళూరుకు 41, విజయవాడకు ఏడు, తిరుపతికి ఏడు, చెన్నైకి మూడు, నెల్లూరుకు ఒకటి చొప్పున నడుపుతున్నారు. మొత్తం ప్రస్తుతం 95 బస్సులు నడుపుతుండగా, అదనంగా అవసరమైన మరో 87 బస్సులు నడిపేందుకు కూడా సిద్ధంగానున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రకంగా నడుపుతున్నప్పటికీ డిమాండ్ ఉన్న రూట్లు ఏవైనా ఉంటే అందులోనే నడిపేందుకు సిద్ధంగానున్నట్టు చెబుతున్నారు. పండుగ సమయాల్లో ఆర్టీసీ ఇది వరకు ఛార్జీలను పెంచేది. కాని ఈసారి పండుగ సమయాల్లోనూ సాధారణ ఛార్జీలతోనే నడిపాలని ఇప్పటివరకు భావిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రయివేటు బాదుడే..

ప్రయివేటు ట్రావెల్స్ మాత్రం పెరిగిన డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఛార్జీలను 10 నుంచి 20 శాతం పెంచేందుకు సిద్ధపడ్డాయి. హైదరాబాద్, విజయవాడకు అధికంగా ప్రయివేటు సర్వీసులు నడుస్తున్నాయి. జిల్లా నుంచి సుమారు 10 సర్వీసులు నడుస్తున్నాయి. వీటికి డిమాండ్ కూడా ఉండటంతో బస్సు ఛార్జీలను పెంచుతున్నాయి. ఈ బస్సుల్లోనూ రద్దీ పెరిగింది.

రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్

పండుగ సమయాల్లో ప్రయివేటు ట్రావెల్స్ ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలపై రవాణా శాఖ దృష్టి సారించింది. గడిచిన రెండు రోజులుగా రవాణా శాఖ అధికారులు బస్సుల తనికీలు చేపడుతున్నారు. అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలుంటాయని రవాణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు జిల్లాలో అధిక ఛార్జీలు వసూలు చేసిన వారిపై చర్యలేవీ తీసుకున్న దాఖలాల్లేవు. అయితే సరుకు రవాణా చేస్తున్న వాటిపై జరిమానాలు విధించారు.

ఇళ్ల స్థలాలు ఇస్తారా..స్వాధీనం చేసుకోమంటారా..?

రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములు కాజేస్తుంటే పట్టదా

మహాధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'జిల్లాలో అర్హులైన నిరుపేద కుటుంబాలు ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాలుగేళ్లు కావస్తోంది. కొందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. స్థలం చూపలేదు. మరికొందరికి ఇళ్లు మంజూరు చేశారు. కొందరికే నిర్మించారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూశారు. ఐదేళ్లైనా ఇళ్లు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పేదలందరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేస్తే సరి.. లేకపోతే ప్రజలను కలుపుకుని ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పంచిపెడతాం'.. అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అన్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాలు, గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, సాగుభూమి పట్టాలు మంజూరు చేయాలని, జగనన్న కాలనీల్లో వేగవంతంగా ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో 39 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటి వరకు 3,600 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. జగనన్న కాలనీలు గ్రామాలకు దూరంగా శ్మశానవాటికలు, వంకల పక్కన ఏర్పాటు చేశారని తెలిపారు. తొలుత ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని హామీ ఇచ్చి తరువాత అనేక నిబంధనలు తీసుకొచ్చి గ్రహణం పట్టించారని దుయ్యబట్టారు. రూ.1.80 లక్షలతో లబ్ధిదారులే ఇల్లు కట్టుకోవాలంటే సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. నామ మాత్రంగా ప్రభుత్వమే నిర్మించే ఇళ్లు తక్కువ సంఖ్యలో ఉంటున్నాయని, సొంతంగా కట్టుకోవాలనుకుంటే లబ్ధిదారులు ముందురాని పరిస్థితి ఉందన్నారు. గ్రామాలు, పట్టణాలకు సమీపంలోనే ప్రభుత్వ భూములు ఉన్నా సూదూర ప్రాంతాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు చూపడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూములను కబ్జాదారులు దోచుకుంటుంటే చోద్యం చేస్తురా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తిలో 8 సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తుంటే కొందరు నకిలీ పత్రాలు సృష్టించి వారిని ఖాళీ చేయించే కుట్ర చేశారని తెలిపారు. దీంతో పేదలు కోర్టును ఆశ్రయించారని తెలిపారు. పరిశీలించిన కోర్టు తప్పుడు పత్రాలు సృష్టించిన సదరు వ్యక్తిని అరెస్టు చేసి, పేదలకు కోర్టు కేసులకు తిరిగి ఖర్చు అయిన డబ్బుల్లో రూ.10 వేలు చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, సదరు అధికారిని సస్పెండ్ చేయాలని తీర్పు వెలువరించిందన్నారు. ఇప్పటివరకు ఆ స్థలంలో తహశీల్దార్ అడుగు కూడా పెట్టని పరిస్థితి ఉందన్నారు. అనంతపురం రూరల్ పరిధిలో ప్రభుత్వ భూమి అని పూర్తిగా విచారించుకున్న తరువాతనే పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. అయితే కొందరు రైతుల పేర్లతో తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూమిని అప్పనంగా ఎకరా రూ.55 లక్షలు చొప్పున విక్రయించేందుకు అగ్రిమెంట్‌లు చేసుకున్నారని అన్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలన చేయమంటే పెళ్లి చూపులకు వచ్చినట్లు వెళ్లి వచ్చిరే తప్ప అది ప్రభుత్వ భూమి, ప్రయివేటు భూమి అని తేల్చలేదన్నారు. దీన్ని బట్టి పేదలంటే ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పట్టనట్లు ఉందన్నారు. అధికారులు కబ్జాదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి రాత్రికి రాత్రే తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కూడేరులో సెస్పెండ్ అయిన తహశీల్దార్ లాగా 11 మంది ఉన్నారన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఆధారాలు కూడా ప్రభుత్వానికి ఇస్తామన్నారు. గతంలో పనిచేసిన ఆర్‌డిఒ 18 ఎన్ఒసిలు మంజూరు చేశారని గుర్తు చేశారు. ప్రజలను, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించే అధికారుల పట్ల ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అలాంటి వారి జాబితా ఇవ్వమన్నా తాము ఇచ్చేందుకు సిద్ధం అన్నారు. కబ్జాదారులు ఇచ్చే కోట్ల రూపాయలు కావాలో, ప్రజలు కావాలో ప్రభుత్వం తేల్చుకోవాలని సవాల్ విసిరారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు, ఇళ్ల నిర్మాణాలు, సాగుపట్టాలు ఇచ్చి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడంలో ఉన్న శ్రద్ధ ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికారులు చొరవ చూపాలన్నారు. రాజీవ్ కాలనీలో 4-8ఎ, 4-7ఎ2, 4-7ఎ3, 4-7ఎపి, 4-7ఎ1, 4-7ఎపి, 58-5, 58-6 సర్వే నెంబర్లలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. అనంతపురం, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, కూడేరు, శింగనమల మండలాల్లో పేదలంరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం ఆర్‌డిఒ మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, జిల్లా నాయకులు క్రిష్ణమూర్తి, గోపాల్, మన్నీల రామాంజినేయులు, తరిమెల నాగరాజు, వలి, ప్రకాష్, మసూద్, బాబు, గపూర్, ఎంపిటిసి సభ్యులు రమీజాబీ, రాజు, వెంకటేష్, ఇర్ఫాన్, కుళ్లాయప్ప, చెన్నారెడ్డి, పోతులయ్య, రామాంజి, సూరి, ఎన్టీఆర్ శీనా, రజక సంఘం నాగభూషణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్ర యాదవ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, రాజు, ఆటో యూనియన్ నాయకులు శివ, ఆది, నాగరాజు, ఆజామ్, మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ, ఎటిఎం.నాగరాజు, ఎర్రిస్వామి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం : ఆర్డీవో

సచివాలయాల ఉద్యోగులు ఆయా గ్రామాల్లోని లబ్ధిదారుల అర్జీలు పరిశీలించి అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మధుసూదన్ సిపిఎం నాయకులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూములా, ప్రయివేటు భూములా త్వరలోనే తేల్చేస్తామన్నారు. ప్రభుత్వ భూములైతే స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

హమాలీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి -పెనుకొండ

సివిల్ సప్లై హమాలీల సమస్యల పరిష్కారం లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ వద్ద నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. పెంచిన కూలి రేట్ల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మూడవ రోజు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ కె. కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇఎస్ వెంకటేష్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా నిరసన కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నప్పటికి ప్రభుత్వం నుండి కానీ అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. సివిల్ సప్లై హమాలీలకు కూలి రేట్ల అగ్రిమెంటు ముగిసి దాదాపు సంవత్సరం గడిచిందన్నారు. కూలి రేట్లు పెంచుతామని చర్చల సందర్భంగా హామీ ఇచ్చిన ప్రభుత్వం 5 నెలలు అవుతున్న ఇప్పటివరకు జీవోను విడుదల చేయలేదన్నారు. పెరిగిన కూలి రేట్ల జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు ఓబులేసు, శంకర, గంగాధర్, హమాలీలు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

కదిరి టౌన్ : సంక్రాంతి సంబరాలలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి వారి ఆధ్వర్యంలో కుంజేటి ఎలక్ట్రానిక్స్ వారి సహకారంతో పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో దాదాపు 75 మంది పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు కుంజేటి అనురాధ, గణేష్ కుమార్ దంపతులు బహుమతులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కదిరి అర్బన్ సీఐ మధు, ఆర్యవైశ్య అధ్యక్షులు సుబ్బరాజు గుప్తా, మేడా వరప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు కపాలిని, చైతన్య, పద్మ, రోటరీ క్లబ్ కోశాధికారి నితిన్, విజయేంద్ర ప్రసాద్ అభిలాష్ ,రాజీవ్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని సప్తగిరి కళాశాలలో బుధవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు ,వాలీబాల్ తదితరుల పోటీలు నిర్వహించి ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. అనంతరం భోగిమంటలతో అంగరంగ వైభవంగా కళాశాల పండుగను నర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల, ఎం బి ఏ కళాశాల, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లు శివశంకర్ రెడ్డి, నారాయణ రెడ్డి, మంజునాథ్ లు భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ గంగిరెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలోని కాకతీయ విద్యానికేతన్లో సంక్రాంతి సంబరాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణమంతా రంగురంగుల ముగ్గులతో, రకరకాల పూలతో, గొబ్బెమ్మలతో అలంకరించారు. విద్యార్థినిలు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు సూర్యప్రకాశ్ రెడ్డి, పద్మ, ఉ పాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రణవాసాయి పాఠశాలలో కరస్పాండెంట్ కృష్ణకిశోర్, ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు

విద్యను బలోపేతం చేయడమే పిఎంశ్రీ పాఠశాలల ఉద్దేశం

డిఇఒ వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మౌలికవసతులు కల్పించి సాంకేతిక సొబగులతో ప్రభుత్వ పాఠశాల విద్యను తీర్చిదిద్దడమే కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల లక్ష్యమని కడప ఆర్‌జెడి, అనంతపురం డిఇఒ మార్తాల వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం అనంతపురం రూరల్ మండలంలోని కురుకుంట ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్‌ని ఆర్‌జెడి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన విద్యనందడానికి, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలను సక్రమ అమలుచేసేందుకు పాఠశాలలపై విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా తమ పాఠ్యాంశాలకు సంబంధించి పాఠ్యప్రణాళిక, టీచింగ్ డైరీని కలిగివుండాలన్నారు. తమ సబ్జెక్టులకు సంబంధించి ప్రతి విద్యార్థి చేతా వర్క్ బుక్ పూర్తి చేయించాలన్నారు. నోట్ బుక్స్ విద్యార్థులు రాశారా లేదా పరిశీలించి తప్పనిసరిగా సంతకం చేయాలన్నారు. సమ్మేటివ్ పరీక్ష పత్రాలను దిద్ది పర్సనల్ మార్కులు రిజిస్టర్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఆయా పరీక్షల్లో విద్యార్థులు చేసిన తప్పులను తెలియజెప్పి సరిదిద్దాలన్నారు. ప్రతి విద్యార్థికీ అన్ని టెక్స్ట్ బుక్స్ బైలింగువల్ పద్ధతిలో అందాయా లేదా అని ప్రధానోపాధ్యాయులు సరి చూసుకోవాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా జగనన్న విద్యా కానుక బ్యాగ్ వంటివి తప్పక కలిగివుండాలన్నారు. జగనన్న గోరుముద్దకు సంబంధించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలన్నారు. నాడు-నేడు ఫేజ్ 1 స్కూల్స్‌లో తాగునీటి ప్లాంట్ పనిచేసే విధంగా చూసుకోవాలని, ప్రతి పాఠశాలలో కంప్లైంట్ బాక్స్, అందరికీ కనిపించే విధంగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తప్పమన్నారు. అనంతరం నాడు-నేడు కింద నిర్మించిన షెడ్యూల్‌ని చూసి ప్రిన్సిపల్ సునీతని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంకటస్వామి, ఎఎంఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ వెంకటకృష్ణారెడ్డి

పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన ఇంద్రజ కోరారు. 37 వ వార్డు ముదిరెడ్డిపల్లిలో రూ.8 లక్షలతో చేపట్టిన రహదారి నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. నులను ప్రారంభించారని ప్రశ్నించారు. . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు అధికారంలో ఉన్న సమయంలో ఆయా పార్టీల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంతోపాటు అభివద్ధి పనుల సైతం వారు గెలిచిన వార్డులోనే అభివద్ధి పనులు చేపట్టారన్నారు. అయితే జగనన్న ప్రభుత్వం కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత ప్రామాణిక ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. అభివద్ధి సైతం పార్టీని చూడకుండా ప్రజలను దష్టిలో పెట్టుకుని అన్ని వార్డులను సమానంగా అభివద్ధి చేస్తామన్నారు. పూర్తిస్థాయిలో నిధులు లేకపోయినప్పటికీ మున్సిపల్ సాధారణ విధులతోనే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మీ నాగేంద్ర, కౌన్సిలర్లు జయరాములు, రమేష్ కుమార్, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సత్యసాయి విద్యార్థుల క్రీడా విన్యాసాలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సత్యసాయి విద్యార్థులు ప్రతిభ పాటవాలు ప్రదర్శించిన క్రీడా విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. బుధవారం హిల్ వ్యూ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ క్రీడ విన్యాసాలు ప్రదర్శించారు. మోటార్ సైకిల్ పై విన్యాసాలు, అగ్నిలో నుంచి బైకుల జంపింగ్, కత్తి సాము, కర్ర సాము, జిమ్నాస్టిక్స్, బంగ్రా నృత్యాలు, ప్రేక్షకులను అలరించాయి. సాయంత్రం నాలుగు గంటలకు చిన్నారుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, సభ్యులు చక్రవర్తి ఈ విన్యాసాలను ప్రారంభించారు. ఈ విన్యాసాల్లో అనంతపురం, బృందావన్, ముద్దనహళ్లి, బెంగళూరు, వైట్ ఫీల్డ్, పుట్టపర్తి, సత్య సాయి క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు. ప్రకృతి అందాల నడుమ ఈ నృత్య విన్యాసాలను పుట్టపర్తి పరిసర గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు సత్యసాయి భక్తులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్, ఎస్ పి రాహుల్ దేవ్ సింగ్, అదనపు ఎస్పి రామకృష్ణ ప్రసాద్, డిఎస్పి యశ్వంత్, డిఆర్ఒ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.





సత్యసాయి విద్యార్థుల విన్యాసాలు

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా మధుసూదన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నందికొట్కూరు గ్రేడ్-2 మున్సిపాలిటీ కమిషనర్‌గా ఉంటూ ధర్మవరం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ కొవ్వూరు కమిషనర్‌గా వెళ్లారు. ఈ క్రమంలో మధుసూదన్‌రెడ్డి అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మేనేజర్ ఆనంద్, అధికారులు, సిబ్బంది మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

పెనుకొండ : పెనుకొండ,హిందూపురం,మడకశిర ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సబ్ కలెక్టర్ కె. కార్తీక్ అధ్యక్షతన బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. డి ఎంఅండ్‌హెచ్ఒ మంజువాణి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మకుమారి, సిడిపిఒ శాంతి లక్ష్మి, రెడ్డిరమణమ్మ, నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం ఆర్డీవో కార్యాలయ సమావేశపు భవనంలో బుధవారం నిర్వహించిన అంగన్వాడీ ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. ధర్మవరం, చెన్నేకొత్తపల్లి ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరికి ఆర్డీవో తిప్పేనాయక్, సీడీపీవో తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.




కదిరి, హిందూపురం ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, ఎమ్మెల్సీ ఇక్బాల్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కదిరి టౌన్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎగువపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని బత్తలపల్లి, హరిజనవాడ, నల్లగుట్ట తండా, దిగువపల్లి, చిన్న దిగువపల్లి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యకు వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. అంతేకాక అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. వీటన్నిటిని చూసి ఓర్వలేని తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లే కార్యక్రమాలు చేస్తున్నారని వీటన్నిటినీ ప్రజలు తిప్పి కొట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎండి ఇస్మాయిల్, మండల కన్వీనర్ ప్రకాష్, జెడ్పీటీసీ రాధాబాయి, వైస్ ఎంపీపీ ఆనంద్ నాయక్, సర్పంచి ఈశ్వరయ్య, ఎంపీటీసీ శివకుమార్ నాయుడు, సర్పంచులు మణికంఠనాయక్, విశ్వనాథ్, భాస్కర, ఇర్షాద్, ఎంపిటిసిలు మధుకర్ రెడ్డి, కుమార్ రెడ్డి, నరసింహులు నాయక్, సింగల్ విండో అధ్యక్షులు ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, టెంపుల్ డైరెక్టర్ గరుడప్ప, ఎస్టీ సెల్ కృష్ణనాయక్, లోకేష్, శ్రీనివాస్ నాయుడు, ప్రభాకర్ రెడ్డి, మండల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పురపాలక సంఘం లోనే వెనకబడిన ప్రాంతమైన అంబేద్కర్ నగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. 27వ వార్డు అంబేద్కర్ నగర్ లో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగేంద్రమ్మ, కౌన్సిలర్లు మద్దన జయప్ప, మల్లికార్జున, ఈడిగ మల్లికార్జున, అయూబ్, జయప్ప, గిరిష్, మణి, కో–ఆప్షన్ సభ్యులు రహమత్, సునీల్, పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అభివృద్ధి చేసి గ్రామంలోకి అడుగుపెట్టు'...

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని తురకలాపట్నం గ్రామం మరోసారి వార్తల్లో నిలిచింది. బుధవారం స్థానిక ఎమ్మెల్యే శంకర నారాయణ చేపట్టిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం ఇందుకు వేదికైంది. వివరాల్లోకి వెళ్తే తురకలాపట్నం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గడప గడపకు తిరుగుతూ హరికృష్ణ అనే వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లారు. ఈసందర్భంగా ఆయనను ఎమ్మెల్యే పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగారు. దీంతో హరికృష్ణ ఒక్కసారిగా ఎమ్మెల్యేపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'మూడు సంవత్సరాలుగా మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్నా మా గ్రామానికి ఏం చేశార'ని నిలదీశారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పగా 'నూరు రూపాయల ప్రభుత్వ సొమ్ము అందించి, 500 రూపాయలు లాగుతున్నార'ని విమర్శించారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరించిన తర్వాతే గ్రామంలో అడుగు పెట్టాలని అన్నారు. గ్రామంలో పశువుల హాస్పిటల్ నిర్మాణం గురించి ఇంత వరకు అతీగతీ లేదని, నూతన బస్టాండ్ ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఇప్పుడు ఉన్న జనరల్ హాస్పిటల్‌ను మరింత అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అసహనానికి లోనైన శంకర నారాయణ ఎలాంటి హామీ ఇవ్వకుండా పోలీసుల సహకారంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకుండా ఎమ్మెల్యే వెనుదిరగడం బాధాకరం అని హరికృష్ణ అన్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన గ్రామస్తుడు



ఎమ్మెల్యే శంకరనారాయణను ప్రశ్నిస్తున్న గ్రామస్తుడు

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి - పెనుకొండ

శ్రీసత్య సాయి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా జిఎం.శేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని సర్వశెట్టి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శేఖర్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, రవి, సుభాష్ చంద్రబోస్, సూర్యనారాయణ, హనుమంతు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బత్తలపల్లి : మండలంలోని చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీహర్ష తెలిపారు. బుధవారం మండలంలోని పోట్లమర్రి గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా చెన్నేకొత్తపల్లి మండలం చందమూరుకు ఇసుకను తీసుకువెళుతున్న ట్రాక్టర్ గమనించి సీజ్ చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓబుల దేవర చెరువు : స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామానికి చెందిన కందుకూరి ఈశ్వరప్ప రోడ్డుపై నిలుచుకొని ఉండగా తంగేడుకుంటకు చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదలో ఈశ్వరప్పకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది హరి, సనావుల్లా ప్రథమ చికిత్స అందించి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎఇ పై దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలి

పెనుకొండ : మండలంలోని కురుబవాండ్లపల్లిలో విద్యుత్ అక్రమ వాడకంపై తనిఖీ లు నిర్వహిస్తున్న విద్యుత్ ఎఇపై దాడి చేసిన గ్రామ పంచాయతీ సర్పంచిని అరెస్టు చేయాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక సిఐ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. దాడికి పాల్పడిన గ్రామ సర్పంచి నాగమూర్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం పెనుకొండ సిఐ కరుణాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ నాయకులు, ట్రాన్స్ కో ఉద్యోగులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

లేపాక్షి: మండలంలో కోడిపల్లిలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద కంది పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతు రుద్రప్ప పొలంలో పంట దిగుబడిని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి మల్లికార్జున, ఎఒ శ్రీలత, ఎఇఒ పుష్పలత, ఇన్సూరెన్సు అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రశ్నాపత్రాల పుస్తకాలు ఆవిష్కరణ

రొద్దం : యుటిఎఫ్ ఆధ్వర్యలో ముద్రించిన పదో తరగతి మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాలను మండలంలోని తురకలపట్నం జడ్పీహెచ్‌స్కూల్‌లో హెచ్‌ఎం శివరాం చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, మండల ప్రధానకార్యదర్శి సత్యమయ్య, ఉపాధ్యాయులు రామకృష్ణ, సురేష్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రికి ఘన నివాళి


కొత్తచెరువు : భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి వర్థంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో అధికారులు, పాఠకులు లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠకులు మొహమ్మద్, రామాచారి, వెంకటప్ప, కృష్ణప్ప, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

విరివిగా ఉపాధి పనులు

బత్తలపల్లి : మండలంలో జరుగుతున్న ఉపాధి పనులకు ఎక్కువ మంది వచ్చేలా కూలీలకు అవగాహన కల్పించాలని పీడీ రామాంజనేయులు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో. సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీతో పాటు ఎపిడి వెంకటా చలపతి, ఎంపిడిఒ సాయి మనోహర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ విరివిగా ఉపాధి పనులు కల్పించాలన్నారు. రైతుల పనులు పూర్తయిపోతున్న తరుణంలో ఉపాధి పనుల కోసం కూలీలు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ ఆదెప్ప, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిసెంట్లు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

రొద్దం.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సవిత ఈ నెల 15న తన పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని బూచర్ల ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు టీడీపీ కార్యకర్త నారాయణ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రమౌళి, శంకరప్ప, క్రిష్టప్ప, బాబు, నారాయణప్ప, సుబ్బరాయుడు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

తూతూమంత్రపు తనిఖీలతో వ్యవస్థ బాగుపడేనా..?



చౌకదుకాణంలో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజల చెంతకు పాలన వ్యవస్థను తీసుకెళ్లాడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ వ్యవస్థను మెరుగు పరచి, ప్రజలకు సేవలు అందించడానికి ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు అధికారాలిచ్చారు. దీంతో పాటు చౌకదుకాణాల నుంచి లబ్దిదారులకు అందే నిత్యావసర సరుకులను ఇంటి వద్దేకే అందించాని, ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. వీటి కోసం కోట్లాది రూపాయలను వెచ్చించారు. అయితే ఈ రెండు వ్యవస్థలు క్షేత్ర స్థాయిలో అనుకున్న ఫలితాలు ఇవ్వడం లేదు. వాటిని గాడిలో పెట్టాల్సిన అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. ఈ రెండు విషయాలపై జిల్లా స్థాయి కలెక్టర్ తూతూ మంత్రపు తనఖీలకు పరిమితం అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముందస్తు సమాచారం ఇచ్చి నామ మాత్రపు తనఖీలతో సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. దీంతో సిబ్బంది అప్రమత్తమై అయ్యాగారు వస్తున్నారంటూ తనిఖీలు నిర్వహించే ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి, అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

కలెక్టర్ బసంత్‌కుమార్ మంగళవారం హిందూపురం రూరల్ మండలం, పట్టణంలో పర్యటించారు. తొలుత రూరల్ మండలంలోని మలగూరు తదితర ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ మధ్యాహ్నం పురపాలక సంఘ పరిధిలోనినింకంపల్లిలోని ఒక చౌక దుకాణాన్ని పరిశీలించారు. వాస్తవంగా ఈ చౌకదుకాణానికి ఎండియు వాహనాన్ని సమకూర్చినప్పటికీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క నెల సైతం పూర్తి స్థాయిలో లబ్దిదారుల ఇంటి వద్దకు సరుకులు సరఫరా చేయలేదు. మంగళవారం సైతం కలెక్టర్ పరిశీలనకు అదే ప్రాంతంలో వస్తున్నారని తెలిసి, స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులు వారికి సమాచారం ఇవ్వడంతో ఎండియు వాహన నిర్వాహకులు చౌకదుకాణానికి 200 మీటర్ల దూరంలో వాహనాన్ని నిలుపుకున్నారు.. వీటిని పరిశీలన చేయాల్సిన కలెక్టర్ కేవలం చౌకదుకాణాన్ని మాత్రం అలా చూసి...ఇలా వెళ్లి పోయారు. ఇదే ప్రాంతంలో పురపాలక సంఘ పరిధిలో 22వ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సచివాలయంలో 10 మంది సిబ్బంది ఉండాల్సుండగా కేవలం నలుగురు మాత్రమే ఉన్నారు. కేవలం నింకంపల్లిలో 5 నిమిషాలు చౌకదుకాణాన్ని పరిశీలించి, మండల పౌరసరఫరాల శాఖ అధికారిణితో మాట్లాడి వెళ్లిపోయారు. ఇలా పర్యాటన పూర్తి చేసుకుని రూరల్ మండలంలోని కిరికెరలోని మూడు సచివాలయాలను తనఖీ చేసి తన పర్యటనను ముగించుకుని వెళ్లారు.

జిల్లా స్థాయి అధికారులు ఇలా తూతూ మంత్రపు తనఖీలు నిర్వహిస్తుంటే వ్యవస్థ ఎప్పటికి బాగుపడుతుందోనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్థానిక అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఈ రెండు వ్యవస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అవుట్ డోర్ పేరుతో కాలయాపన

పురపాలక సంఘ వ్యాప్తంగా 43 సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శుల్లో కొన్ని విభాగాలకు చెందిన కార్యదర్శులు సమయ పాలన మాత్రం తూచ తప్పకుండా పాటిస్తున్నారు. అది కేవలం రిజిస్టర్‌లో సంతకం పెట్టడం, వారి సెల్ ఫోన్‌లో ముఖ హాజరు వేసే వరకు మాత్రమే. ఈ రెండు పూర్తి అయిన వెంటనే అవుట్‌డోర్‌లో పని ఉందని మూవెంట్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి దర్జాగా వెళుతున్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి అన్ని విభాగాలకు చెందిన కార్యదర్శులు తప్పని సరిగా సచివాలయాల్లో అందుబాటులో ఉండి, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించాలని నిబంధనలు ఉన్నప్పటికి దీనిని చాలా మంది పాటించడం లేదు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హిందూపురం

సత్యసాయి జిల్లా ప్రయివేటు పాఠశాలల సంఘం (అపుస్మా)2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఇఒ గంగప్ప చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఎంఇఒ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి రియాజ్, జిల్లా గౌరవాధ్యక్షులు ముస్తఫా అలీ ఖాన్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు బాలకృష్ణ, దీపు, ప్రసాద్, రాధాకృష్ణ, షౌకత్, మూర్తి, రియాజ్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ పై ప్రత్యేక సమావేశం

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపల్ కార్యాలయ సమావేశపు భవనంలో ప్రత్యేక బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జెఎఒ శ్రీనివాసులు బడ్జెట్ అంశాలపై చదివి వినిపించారు. 2022–23 సంవత్సరానికి 37,52,77,673 రుపాయలు అంచనా వేయగా 2023–24 సంవత్సరానికి 50,71.98,840 రూపాయిలకు బడ్జెట్ అంచనాలు రూపొందించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ధర్మవరం పట్టణ అభివృద్ధికి అందరూ మరింత సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇప్పటికే గత కౌన్సిల్ కంటే మున్సిపాలిటీని అభివృద్ధి చేశామన్నారు. మున్సిపాలిటీ పన్నులను చెల్లించడంలో కౌన్సిలర్లు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డిఇలు వన్నూర్ స్వామి, క్రిష్ణారావు, మేనేజర్ ఆనంద్. ఎఇలు ప్రతాప్, హరీశ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌ను చదివి వినిపిస్తున్న జెఎఒ శ్రీనివాసులు

'జగనన్న పాలవెల్లువ'తో మహిళలకు లబ్ధి

ప్రజాశక్తి - కదిరి టౌన్

జగనన్న పాలవెల్లువతో మహిళలకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే సిద్దారెడ్డి పేర్కొన్నారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ప్రారంభించిన ఏడాది పూర్తి అయిన సందర్భంగా కదిరి రూరల్ ఎగదొడ్డి మోరీ వద్ద గల జగనన్న పాలవెల్లువ కేంద్రంలో ఎమ్మెల్యే పాడి రైతులతో కలసి సంబరాలు జరుపుకున్నారు. . ఈసందర్భంగా పాడి రైతులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, వైస్ ఎంపీపీ ఆనంద నాయక్, సర్పంచి మణికంఠ నాయక్, కో ఆప్షన్ అల్లాబక్షు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, జగనన్న పాల వెల్లువ సిబ్బంది, పాడి రైతులు, వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు




హిందూపురం, చిలమత్తూరు మండలాల్లో ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

హిందూపురం : స్వతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు బుధవారం పట్టణంలోని శ్రీకంఠాపురం వడ్డెర్లు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ వడ్డే ఓబన్న ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారనానరు. స్వతంత్ర వీరుడు వడ్డే ఓబన్నకు తగినంత గుర్తింపు ఇవ్వాలని వడ్లెర్లను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు వడ్డెర్లు ఎక్కువ నివాసముంటున్న శ్రీకంఠాపురంలో స్థలాన్ని కేటాయిస్తే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు రంగప్ప, వడ్డే ప్రసాద్, నాగరాజ్, అశ్వర్థప్ప, వెంకటేష్ కోట, అక్కులప్ప, దుర్గనవీన్, శ్రీనివాసులు, నారాయణస్వామి, కెంచప్ప, గంగప్ప, శివగోవింద్, సునీల్ కుమార్, ప్రభు, గురుశంకర్, రాజా, వంశీ, గంగరాజు, నవీన్, పురుషోత్తం, మురళి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : స్వాతంత్ర సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతిని శ్రీ ఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కదిరి పట్టణంలోని కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలలో పలువురు మాట్లాడుతూ వడ్డే ఓబన్న చేసిన పోరాటాలను వివరించారు. అతని త్యాగాలు, భావి తరాలకు స్ఫూర్తినిచ్చేలా ప్రాచుర్యం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖాద్రీ వడ్డెర్ల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సంపంగి గోవర్ధన్, సీనియర్ నాయకులు సైదాపురం రమణ, రాష్ట్ర యువనాయకులు వడ్డె బాబు, కుటాగుళ్ళ గంగాధర్, వడ్డెర యువజన జాతీయ అధ్యక్షులు అల్లుగుండ నానాయణ స్వామి, వల్లెపు నాగార్జున, కటకం వారి పల్లి ఆంజనేయులు, సంపంగి భాస్కర్, బత్తల శ్రీనివాసులు, దేరంగుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ నందు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం మండల అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు అంజనప్ప , వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

తలుపుల: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర యువసేన అధ్వర్యంలో వడ్డె ఓబన్న జయంని బుధవారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు కె గంగరాజు, అధ్యక్షులు కే శ్రీనివాసులు, వడ్డెర యువసేన అధ్యక్షులు జే దేవా, జనరల్ సెక్రటరీ జే సూరి, మరియు కే గణేష్, ఉపాధ్యక్షులు బి శ్రీధర్, ట్రెజర్ జే అనిల్, మరియు వి రాజేష్, సలహాదారులు కృష్ణ, గంగరాజు, పవన్, శ్రీనాథ్, హరి, రాజు, గంగాధర్, కే వెంకటరమణ మొదలగు వడ్డెర కులస్తులు అందరు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

లేపాక్షి : మండలం పరిధిలోని కంచిసముద్రం పంచాయతీ లోని మద్దిపి గ్రామంలోవడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో అంజి, రామాంజినేయులు సుబ్బారాయప్ప, పాపన్న, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని చిలమత్తూరు మండల కేంద్రంలో వడ్డెర్లు ఘనంగా నిర్వహించారు. మండల వీధుల చిత్రపటాన్ని ఊరేగించాడు. వడ్డే ఓబన్న ఆశయాలను నెరవేరుస్తామని నినాదాలు చేశారు. వడ్డెర్ల సంఘం ఓబన్న ఆశయ సాధన కోసం పని చేస్తుందని అన్నారు. అనంతరం ఓబన్న కార్యాలయ స్థలం వద్ద చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు కొల్లకుంట అంజినప్ప సీనియర్ పాత్రికేయులు శివకుమార్, మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి ,ఆదినారాయణప్ప, బండి నారాయణప్ప, కష్ణమూర్తి ,డాబా చంద్ర ,సుధాకర్,ధను తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను వడ్డెర సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో రాష్ట్ర వడ్డెర యువ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు గోగుల మూర్తి తదతరులు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రంగుల ప్రతాప్, దేరంగుల చంటి, స్టోర్ డీలర్ గోగుల వన్నూరయ్య, రంగుల అశోక్, శంకర్, రాజా, హరి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, జిల్లా అధికార ప్రతినిధి రఘువీర చౌదరి, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామలింగ, మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ అధ్యక్షులు రవి శంకర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొల్లుకుంట అంజిన్నప్ప, వడ్డే శ్రీనివాసులు, వడ్డే అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను కొత్తచెరువులో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి రోడ్డులో ఓబన్న చిత్రపటానికి తిరుమల డీఎస్పీ వేణుగోపాల్, వడ్డెర్లు కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పాపన్న సత్రం వెంకటేశు, నారాయణ, భాస్కర, వెంకట్రాముడు, బళ్లారి బాబు, శ్రీనివాసులు, వలిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు